క్లుప్తంగా

బాలా త్రిపుర సుందరికి గాజుల అలంకరణ



గాజుల అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు

మండపేట: శ్రావణ పౌర్ణమి నాడు బాలా త్రిపుర సుందరీదేవిని దర్శించుకుంటే సకల శుభాలు కలుగుతాయని మండపేట అగస్త్యేశ్వర స్వామి ఆలయ అర్చకుడు అయినవిల్లి సుబ్రహ్మణ్య శర్మ అన్నారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా అమ్మ వారిని సోమవారం లక్ష గాజులతో అలంకరించారు. పట్టణంలో ప్రసిద్ధ జనార్దన అగస్త్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని అమ్మవారికి ఈ గాజుల అలంకరణ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి అగస్త్యేశ్వర స్వామిని దర్శించుకున్నారు.

వ్యవసాయానికి నారుమడులే కీలకం

కాజులూరు: వ్యవసాయంలో నారుమడుల దే కీలకమైందని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. మండలంలోని చేదువాడ, బందనపూడి తదితర గ్రామాలలో సోమవారం వ్యవసాయాధికారి అశోక్ పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. చేదువాడలో ఆయన మాట్లాడుతూ నారు ఆరోగ్యంగా ఉంటేనే పంట బలంగా పెరుగుతుందన్నారు. వరి సాగులో అనవసర వ్యయాలను తగ్గించి అధిక దిగుబడి సాధించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు ఆయన సూచించారు.

వేంకటేశ్వరునికి జన్మ నక్షత్ర పూజలు



అంగరలో వైభవ వేంకటేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర గ్రామంలోని వైభవ వేంకటేశ్వరస్వామి జన్మ నక్షత్రమైన శ్రవణా నక్షత్ర పూజలను స్వామివారి ఆలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చక బృందం స్వామిని విశేషంగా అలంకరించారు. పంచామృతాభిషేకం చేసి స్వామి జన్మ వృత్తాంతాన్ని భక్తులకు వివరించారు.

వైభవంగా శ్రీవారి నక్షత్ర కల్యాణం



రాయవరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీవారి కల్యాణం

రాయవరం: స్థానిక శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారికి సోమవారం నక్షత్ర కల్యాణం నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి జన్మ నక్షత్రమైన శ్రవణను పురస్కరించుకుని స్వామిఅమ్మవార్ల కల్యాణం చేపట్టారు. వేద పండితులు అంగర అయ్యమాచార్యులు, పెద్దింటి కృష్ణమాచార్యులు, అంగర యోగానంద నారాయణాచార్యులు (బాబు), అంగర లక్ష్మీనారాయణాచార్యులు, అంగర జనార్దనాచార్యులు స్వామి వారి దివ్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాయవరం పరిసర గ్రామాలకు చెందిన సుమారు 200 మంది దంపతులు, అధిక సంఖ్యలో భక్తులు ఈ వేడుకలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్న సమారాధన నిర్వహించారు.

ఆలయాల్లో వైఖానస జయంతి వేడుకలు

మండపేట: వైఖానస జయంతి వేడుకలు సోమవారం మండలంలోని వివిధ ఆలయాల వద్ద ఘనంగా జరిగాయి. ద్వారపూడిలోని గోపాలస్వామి, జెడ్.మేడపాడులోని కేశవ స్వామి, ఏడిదలోని జనార్దనస్వామి, కోదండ రామాలయం, అర్తమూరులోని వేణుగోపాల స్వామి, వెలగతోడులోని రామాలయాల్లో ఈ వేడుకలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వైఖానస స్వామివారి విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు, పూజాదికాలు నిర్వహించారు. స్వామి వార్లకు నూతన వస్త్రాలు సమర్పించారు. విష్ణు సహస్ర లక్ష స్తోత్రం, రామరక్ష స్తోత్ర పారాయణాలు భజనలు నిర్వహించారు.

కుట్టిందంటే..ముప్పే

- పెరుగుతున్న దోమల ప్రభావం
- పారిశుధ్య లోపమే ప్రధాన కారణం
- ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్న బాధితులు
- అవగాహనే ఆయుధమంటున్న వైద్యాధికారులు
- నేడు అంతర్జాతీయ దోమల నివారణ దినం

కపిలేశ్వరపురం: దోమలు ప్రాణాలను హరిస్తాయి. వాటి పట్ల అవగాహనతో మెలగాల్సిన అవసరం ఉంది. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో జ్వరాల తీవ్రత తరచూ కనిపిస్తోంది. దోమల్లోని రకాలు, వాటి జీవన విధానం, వాటి వల్ల కలిగే వ్యాధులు, ప్రాణాంతకర పరిస్థితులపై 'వరల్డ్ మస్కిటో డే' సందర్భంగా ఈ కథనం...

వరల్డ్ మస్కిటో డే ప్రాధాన్యం ఇదీ...

బ్రిటిష్ దేశానికి చెందిన రొనాల్డ్ రాస్ అనే సైంటిస్ట్ ప్రజలను పట్టి పీడిస్తున్న జ్వరాలపై పరిశోధన చేశాడు. అనాఫిలస్ అనే ఆడ దోమ వల్ల మలేరియా అనే వ్యాధి సోకుతుందన్న విషయాన్ని 1897 ఆగస్టు 20న ప్రపంచానికి తన పరిశోధన ద్వారా తెలియపరిచార. ఆయన సేవలకు గుర్తింపుగా ఆగస్టు 20ను అంతర్జాతీయ దోమల నివారణ దినంగా ప్రకటించారు. ఆ రోజున ప్రపంచ వ్యాప్తంగా దోమల ప్రభావాలపై సమీక్షించడం, నివారణ కార్యక్రమాలను రూపొందించుకోవడం చేస్తున్నారు.

రెండు నియోజకవర్గాల్లో జ్వర పీడితులిలా..

ఇటీవల జ్వరాల ప్రభావంతో 171 మంది రామచంద్రపురం పట్టణం, రూరల్ గ్రామాల్లోని ఐదు ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయించారు. కె.గంగవరం మండలంలోని రెండు ఆసుపత్రుల్లో 45, కాజులూరు మండలంలో రెండు ఆసుపత్రుల్లో 79 మంది, కపిలేశ్వరపురం మండలంలోని నాలుగు ఆసుపత్రుల్లో 61 మంది, మండపేట పట్టణం, రూరల్ గ్రామాల్లోని ఐదు ఆసుపత్రుల్లో 130 మంది, రాయవరం మండలంలోని రెండు ప్రభుత్వాసుపత్రుల్లో 50 మంది జ్వరాలతో ఆశ్రయించారు. మరింత మంది మండపేట, రామచంద్రపురం పట్టణాల్లోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేరుతున్నారు.



కోరుమిల్లి గ్రామంలో పారిశుధ్య పనులు చేస్తున్న సిబ్బంది

పారిశుధ్య లోపం చెంతనే దోమల ఆవాసం

దోమల తీవ్రత ప్రబలడానికి ప్రధాన కారణం క్షేత్ర స్థాయిలోని పారిశుధ్య లోపమే. రామచంద్రపురం మున్సిపాలిటీ పరిధిలోని పలుచోట్ల చెత్త రహదారులపైనే ఉండడంతో దోమలకు ఆవాసాలుగా మారాయి. 28 వార్డులు గల మున్సిపాలిటీలో 91 మంది పారిశుధ్య కార్మికులు చెత్తను వార్డుల్లోని చెత్త పాయింట్ల వద్ద వేస్తున్నారు. వాటిని డంపింగ్ యార్డుకు తరలించడంలో తరచూ జాప్యం జరుగుతోంది. మండపేట పట్టణంలో సుమారు 7 కిలోమీటర్ల పొడవునా మేజర్ డ్రెయిన్లు, 63 కిలోమీటర్ల పొడవునా మీడియం డ్రెయిన్లు ఉన్నాయి. వాటిలో తరచూ పూడిక పేరుకు పోవడంతో పట్టణం మధ్యన ఉన్న డ్రెయిన్లలోని మురుగు నీరు ప్రవాహ సమస్య తలెత్తుతోంది.



రొనాల్డ్ రాస్

దోమలు కలిగించే వ్యాధులివీ..

1. అనాఫిలస్ దోమ: ఈ దోమ వల్ల మలేరియా వ్యాధి సోకుతుంది. ఇది శుభ్రమైన నీటిలో సంచరిస్తుంది. ఇది వంద మీటర్ల మేర మాత్రమే సంచరించగలదు.



వ్యాధికారి క్యూలెక్స్ దోమ

2. క్యూలెక్స్: ఈ దోమ వల్ల ఫైలేరియా, మెదడుకు సంబంధించిన వ్యాధి సోకుతుంది. ఇది మురుగు నీటిలో మసలుతుంది. ఇది 11 కిలోమీటర్ల మేర సంచరిస్తూ ఉంటుంది.

3. ఏడిస్ : ఈ దోమ వల్ల డెంగీ, చికెన్ గున్యా వ్యాధులు సోకుతాయి. ఇది చెట్టు తొర్రలు, నివాస ప్రాంతాల్లోని వస్తువుల్లో నిల్వ ఉంచిన నీటిలోనూ, కొబ్బరి డిప్పలు, పశువుల పాకల వద్ద అపరిశుభ్ర పరిస్థితుల మధ్య సంచరిస్తుంది. ఇది వంద మీటర్ల మేర మాత్రమే సంచరించగలదు.

4. మేన్‌సోనియా: ఈ దోమ వల్ల ఫైలేరియా, చికున్‌గున్యా వ్యాధులు సోకుతాయి. దీని ప్రభావం ఇండియాలో తక్కువగా ఉంది. ఇది చెరువులు, కాల్వల్లో ఉండే గుర్రపు డెక్క, మొక్కలో ఉంటుంది. ఇది వంద మీటర్ల మేర మాత్రమే సంచరించగలదు.

> **ముందస్తు పరీక్షలతో వ్యాధి నిర్ధారణ**
>
> 
>
> వ్యాధి నిర్ధారణకు ప్రాథమిక దశలో స్క్రీనింగ్ టెస్టులు చేయాలి. మలేరియా నిర్ధారణకు బీఎస్ ఫర్ ఎంపీ, ఫైలేరియాకు డీఈసీ ప్రావికేటివ్ టెస్ట్, డెంగీకి ర్యాపిడ్ కిట్‌తోనూ రక్త పరీక్ష చేస్తారు. 20 వేల లోపు ప్లేట్‌లెట్స్ తగ్గితే తీవ్ర మైన పరిస్థితిగా పరిగణించాలి.
>
> డాక్టర్ కరుణేంద్రకుమారి, వైద్యాధికారి, అచ్యుతాపురం

వ్యాధుల లక్షణాలు ఇలా...

మలేరియా: వణుకుతో కూడిన చలి జ్వరం వస్తుంది. రెండు రోజులకో సారి జ్వరం కనిపిస్తుంది. ప్రాథమిక దశలోనే చికిత్స ప్రారంభించాలి. తీవ్రత పెరిగితే మెదడు ప్రభావితమై రోగి చనిపోయే పరిస్థితులు ఉంటాయి.

ఫైలేరియా: సాధారణంగా కాలు వాస్తుంది. గజ్జిలో బిళ్లలు వేస్తాయి. సాయంత్రం వేళ తక్కువ స్థాయిలో జ్వరం కనిపిస్తుంది.

డెంగీ జ్వరం: జ్వరం తీవ్ర స్థాయిలో ఉంటుంది. తలనొప్పి, జలుబు, కీళ్ల నొప్పులు, గొంతునొప్పి, కళ్ళు ఎర్రబారడం జరుగుతుంది. ప్లేట్‌లెట్స్ కౌంట్ పడి పోకుండా జాగ్రత్తపడాలి. శరీరంలో మచ్చలు వస్తే ప్లేట్‌లెట్స్ కౌంట్ పడిపోయినట్టుగా భావించవచ్చు.

చికున్‌గున్యా: ఈ వ్యాధి దీర్ఘకాలంపాటు ఉండొచ్చు. కీళ్ల నొప్పులు అధికంగా ఉంటాయి. రెండు నెలలు నుంచి ఏడాది పాటు ఈ నొప్పులు బాధించవచ్చు.

సోదర భావానికి ప్రతీక రక్షాబంధన్



రాయవరం మండలం పసలపూడిలో రాఖీలు కడుతున్న సోదరీ మణులు



అంగరలో అన్నకు రాఖీ కడుతున్న చెల్లెలు



గొల్లపాలెంలో తమ తోబుట్టువులకు రాఖీల కడుతున్న చిన్నారులు

రాయవరం: అన్నాచెల్లెళ్ల అనుబంధానికి, ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పర్వ దినాన్ని సోమవారం ఘనంగా జరుపుకున్నారు.మండలంలో ఉదయం నుంచి రాఖీ పర్వదినం సందడి ప్రారంభమైంది. సోదరీమణులు తమ సోదరులకు రాఖీలు కట్టారు. శ్రావణ పౌర్ణిమను పురస్కరించుకుని సోదరులకు, సోదరులుగా భావించే వారికి చెల్లెళ్లు, అక్కలు రాఖీలు కట్టడం ఆచారం. రాఖీ పర్వదినాన్ని పురస్కరించుకుని పలువురు వేకువజామునే ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

జంధ్యాల పౌర్ణమి

వేదాలకు జన్మదినంగా భావించే శ్రావణ పౌర్ణమిని జంధ్యాల పౌర్ణమిగా నిర్వహించుకున్నారు. మహావిష్ణువు కుమారుడు బ్రహ్మ వేదాలను తన నాభి నుంచి తీసిన రోజు గాను, సకల విద్యలకు అధిపతి అయిన సరస్వతీదేవికి గాయత్రీమాతగా బ్రహ్మముడిలో ఆవాహన అయిన రోజుగా భావిస్తారు. అందుకే శ్రావణ పౌర్ణమిని జంధ్యాల పౌర్ణమిగా జరుపుకున్నారు. వేదాధ్యయనం చేసిన వారు ఉపకర్మ కార్యక్రమాన్ని నిర్వహించి శరీరంలో భాగమైన జీర్ణోపవీతాలను తొలగించారు. వేదాలకు జన్మదినంగా భావించి ఆదివారం యజ్ఞోపవీత ధారణ చేశారు.

కపిలేశ్వరపురం మండలంలో..

కపిలేశ్వరపురం: రాఖీ పండుగ నేపథ్యంలో సోమవారం గ్రామాలు సందడిగా మారాయి. సోదరీ మణులు తమ తోడబుట్టిన సోదరులకు రాఖీ కట్టి ఆప్యాయత పొందారు. రక్త సంబంధీకులే కాకుండా వరుసకు ఆప్యాయతలను పంచే బంధంతో రాఖీ కట్టి ప్రేమపూర్వక మానవ సంబంధాలకు నిలయంగా నిలిచారు. అంగర, పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం, తాతపూడి, వెదురుమూడి, వల్లూరు, నల్లూరు, నేలటూరు, వడ్లమూరు, అచ్యుతాపురం, నిడసనమెట్ట, కాలేరు, టేకి, మాచర, కోరుమిల్లి, నాగుల చెరువు, వాకతిప్ప, అద్దంకివారి లంక, కేదారిలంక గ్రామాల్లో సోదర, సోదరీ మణులు సందడి చేశారు. సోదరులు ఇచ్చే బహుమతులను చూసి సంబరపడ్డారు. ఆలయాలను సందర్శించి కలకాలం ప్రేమపూర్వక జీవితాన్ని ప్రసాదించాలని దేవతామూర్తులను వేడుకున్నారు.

కాజులూరులో...

కాజులూరు: మండల గ్రామాలలో సోమవారం రాఖీ పౌర్ణమి (శ్రావణ పౌర్ణమి, రక్షబంధన్) పండగను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు.

రామచంద్రపురంలో..



ద్రాక్షారామలో అన్నయ్యకు రాఖీలు కట్టి ఆశీర్వాదం అందుకుంటున్న చెల్లెళ్లు

రామచంద్రపురం రూరల్ : మండలంలో శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం రామచంద్రపురం పట్టణంలోను, మండలంలోని గ్రామాల్లోను రాఖీ పండగను ఘనంగా నిర్వహించుకున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో చిన్నారులతో పాటు పెద్దలు కూడా తమ సోదరులకు రాఖీలు కట్టి సందడి చేశారు. రాఖీని కట్టడం ద్వారా తమ సోదరులకు భగవంతుని అనుగ్రహం ఉండాలన్న ఉద్దేశంతో ముందుగా తమ ఇష్ట దైవాల ముందు ఉంచిన రాఖీలను తమ సోదరులకు కట్టి, వారికి మిఠాయిలు తినిపించారు. సోదరులందరూ బహుమతులను అందజేసి తమ ఆనందాన్ని ప్రకటించారు.

మాజీ ఎమ్మెల్యే చౌదరికి అయ్యప్ప స్వాముల నివాళి



మాజీ ఎమ్మెల్యే వీవీఎస్ఎస్ చౌదరికి నివాళి అర్పిస్తున్న అయ్యప్ప స్వాములు

మండపేట: శ్రీ అయ్యప్ప దేవాలయం వ్యవస్థాపకుడు, మాజీ ఎమ్మెల్యే వీవీఎస్ఎస్ చౌదరి 85వ జయంతిని పట్టణంలో సోమవారం నిర్వహించారు. స్థానిక అలమూరు రోడ్డులోని అయ్యప్ప దేవాలయంలో అయ్యప్ప మాలధారుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కొప్పాక సత్యనారాయణ, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన త్యనారాయణ తదితరులు చౌదరి చిత్రపటం వద్ద పూలమాలలు ఉంచి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండుసార్లు ఆలమూరు ఎమ్మెల్యేగా పని చేసిన చౌదరి నియోజకవర్గానికి విశేష సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్య నంబూద్రి, శ్రీకాంత్ ఆచార్యులు, చిట్టూరి శివస్వామి, 50 మంది స్వాములు పాల్గొన్నారు. కార్యక్రమంలో చిలుకూరి బాపిరాజు, పోతంశెట్టి సత్తిబాబు, ముత్యాల సత్తిరాజు, కొప్పాక బాబీ, దుగ్గిరాల బూరయ్య, వల్లూరి రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామలో విద్యార్థుల ర్యాలీ



ద్రాక్షారామ బోసుబొమ్మ సెంటర్‌లో కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

రామచంద్రపురం రూరల్: ఇటీవల కోల్‌కతాలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో వైద్యురాలిని పాశవికంగా హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ద్రాక్షారామలో సోమవారం సుమారు 200 మంది సూర్య హైస్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బోసుబొమ్మ సెంటర్ వద్ద కొవ్వొత్తులతో ప్రదర్శన చేసి చేశారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

బంద్‌ను విజయవంతం చేయండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న నాయకులు

కాజులూరు: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ బుధవారం తలపెట్టిన రాష్ట్ర వ్యాప్తం బంద్‌ను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని మండల గ్రామాలకు చెందిన పలువురు ఎస్సీ నాయకులు పిలుపునిచ్చారు. కాజులూరు అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం పార్టీలకు అతీతంగా పలువురు మాల సమాజిక వర్గానికి చెందిన నాయకులు సమావేశమై బంద్ నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా సంఘ నాయకుడు పోలినాటి సూర్యచంద్రం మాట్లాడుతూ రాజకీయ స్వలాభం కోసం పాలకులు అన్నదమ్ముల్లా ఉన్న ఎస్సీ కులాల మధ్య సిచ్చుపెట్టి విభజించి పాలించు అన్న చందంలా పాలన సాగిస్తున్నారన్నారు. దీనిని వ్యతిరేకిస్తూ ఈ నెల 21న రాష్ట్ర వ్యాప్తం బంద్‌కు పిలుపునిచ్చామన్నారు. అన్ని సమాజిక వర్గాల ప్రజలు బంద్‌కు తమవంతు సహకారం అందించాలని కోరారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

మలికిపురం: మండల బీసీ ఉద్యోగ సంక్షేమ సంఘం సోమవారం విశ్వేశ్వరాయపురంలోని చెల్లుబోయిన సూర్యారావు కమ్యూనిటీ హాల్‌లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా పంచాయతీ రాజ్ డీఈఈ పాల్గొన్నారు. సమావేశంలో 2024లో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన బీసీ విద్యార్థులకు నగదు ప్రోత్సాహం అందించారు. అలాగే ఈ ఏడాది పదవీ విరమణ చేసిన ఉద్యోగులు అనిశెట్టి సాయిబాబా, యాండ్ర మల్లికార్జున్‌రావు, గుబ్బల సింహాచలం లకు సన్మానం చేశారు. అలాగే బోధనా సిబ్బందిని కూడా సన్మానించారు. మండలం బీసీ ఉద్యోగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి జేపీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వామివారి మాస కల్యాణం



దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఈవో

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి శ్రీ జగన్మోహినీ కేశవ స్వామి ఆలయంలో సోమవారం స్వామివారి మాస కల్యాణం కనుల పండువగా జరిగింది. ఉదయం స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అవరణలో స్వామి వారి కల్యాణం వైభవంగా జరిగింది. కల్యాణాన్ని తిలకించిన భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ బి.కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ స్వామి వారి కల్యాణం సందర్భంగా ర్యాలి గ్రామానికి చెందిన జిన్నూరు నాగేశ్వరరావు, పార్వతి దంపతులు స్వామివారికి రూ.20 వేలు విలువ చేసే 5 గ్రాములు విలువ చేసే వెండి యజ్ఞోపవీతం, అమ్మవార్లకు 2.350 గ్రాముల రెండు జతల బంగారు సూత్రాలు బహుకరించినట్టుతెలిపారు. దాతకు ఆయన చేతుల మీదుగా స్వామివారి చిత్రపటం అందజేశారు.

ముంపు బాధితులకు సాయం

మామిడికుదురు: గత నెలలో కురిసిన భారీ వర్షాల వల్ల పాశర్లపూడిలంకలో ముంపు బారినపడిన 186 మంది బాధితులకు 25 కిలోలు బియ్యం, కూరగాయలు పంపిణీ చేశారు. సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు చేతుల మీదుగా వాటిని బాధితులకు అందజేశారు. పంచాయతీ కార్యదర్శి డి.సురేష్, వీఆర్వో వీఎస్ఆర్ఎస్ రాయుడు, స్థానికులు పాల్గొన్నారు.

డాగూరేకు ఘన నివాళి



ద్రాక్షారామలో డాగురే చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న ఫొటో, వీడియోగ్రాఫర్లు



కె.గంగవరం భవిత కేంద్రంలో చిన్నారులకు పండ్లు అందజేస్తున్న ఫొటో, వీడియోగ్రాఫర్లు

రామచంద్రపురం రూరల్: ప్రపంచ ఫొటోగ్రాఫర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ద్రాక్షారామ పద్మ స్టూడియో వద్ద రామచంద్రపురం జోన్ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్, హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కెమెరా సృష్టికర్త డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జోన్ అధ్యక్షుడు గాదం మధుసూదన్‌రావు, కార్యదర్శి సుంకర వెంకన్న, గౌరవాధ్యక్షుడు ముచ్చుమిల్లి దుర్గారావు, కోనసీమ జిల్లా ఉపాధ్యక్షుడు వీకే బాలకృష్ణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దిరెడ్డి వరప్రసాద్(నాని), ఫొటోగ్రాఫర్లు బాబి, రమణ, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరం మండలంలో..

కె.గంగవరం: మండలంలోని దంగేరు శివారు రామఘట్టాల వద్ద సోమవారం ప్రపంచ ఫొటోగ్రాఫర్స్ దినోత్సవాన్ని మండలంలో ఘనంగా నిర్వహించారు. తొలుత కెమెరా సృష్టికర్త లూయిస్ జాక్సన్ డాగూరే చిత్రపటానికి పూలమల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మండల ప్రొఫెషనల్ ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగుల పాఠశాల భవిత కేంద్రంలో చిన్నారులకు పండ్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్స్ జిల్లా నాయకుడు కనికెళ్ల కనకరత్నం, మండల అధ్యక్షుడు అంబటి సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడు వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు లక్ష్మీప్రసన్న



రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులతో కోచ్

అంబాజీపేట: అంబాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని కేఎల్ ప్రసన్న తెలంగాణ రాష్ట్రంలోని గద్వాలలో త్వరలో జరిగే జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైందని హెచ్ఎం కె.సాయిరామ్ సోమవారం తెలిపారు. ఈ నెల 17, 18 తేదీల్లో విజయనగరంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో 62 కిలోల విభాగంలో ప్రసన్న బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిందన్నారు. ఆమెతో పాటు సింగిల్స్‌లో పి.భార్గవిశ్రీకళ వెండి పతకం సాధించిందన్నారు. జూనియర్స్ 55 కిలోల విభాగంలో పి.ఆదిత్య కాంస్య పతకం సాధించాడని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను హెచ్ఎం సాయిరామ్, కోచ్ పి.త్రిమూర్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.

మరమ్మతుల్లేక.. సాగునీరందక..

- అభివృద్ధికి నోచుకోని స్లూయిజ్‌లు
- ముంపు బారిన పంట పొలాలు
- పట్టించుకోని అధికారులు

ఆత్రేయపురం: సెంట్రల్ డెల్టా ఇరిగేషన్ పరిధిలోని సాగునీటి పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. లొల్ల లాకుల ద్వారా డెల్టా ప్రాంతానికి సాగునీరు సక్రమంగా అందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. సెంట్రల్ డెల్టా ఆధునీకరణ పనుల్లో భాగంగా పూడిక పనులు మినహా మిగతా అన్ని పనులు తూతూమంత్రంగా చేపట్టి అధికారులు చేతులు దులిపేసుకుంటున్నారు.

అభివృద్ధి పనులు చేపట్టకపోతే..

బ్రిటీష్ హయంలో నియమించిన స్లూయిజ్‌లు, డీపీలు, గేట్లు, లాకుల వ్యవస్థ శిథిలస్థితికి చేరింది. దీంతో ఏటా రైతుకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో డెల్టా పరిధిలో ఇంజినీరింగ్ సిబ్బంది సూచిస్తున్న అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో రాబోయే కాలంలో పంటలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ర్యాలి వద్ద శిథిలావస్థకు చేరిన స్లూయిజ్

నియోజకవర్గ పరిధిలో ఉన్న స్లూయిజ్‌లు

నియోజకవర్గ పరిధిలోని ఆత్రేయపురం మండలంలోని లొల్ల ఇరిగేషన్ సెక్షన్‌లో ఐదు చానల్స్‌పై 92 స్లూయిజ్‌లు, డీపీలు, రావులపాలెం మండలంలోని గోపాలపురం సెక్షన్‌లో రెండు చానల్స్‌పై 42 స్లూయిజ్‌లు, డీపీలు, ఆలమూరు మండలంలోని చొప్పెల్ల సెక్షన్‌లో నాలుగు చానల్స్‌పై 60 స్లూయిజ్‌లు, డీపీలు, ఆలమూరు ఇరిగేషన్ పరిధిలోని రెండు చానల్స్‌పై 20 స్లూయిజ్‌లు, డీపీల ద్వారా సుమారు 60 వేల ఎకరాల శివారు భూములకు సాగునీరు అందుతుంది.

సిబ్బంది స్లూయిజ్‌లను ఆధునికరిస్తే రైతులు ఎవరి అవసరం లేకుండా పంట చేలకు నీరు అవసరమైన సమయాల్లో సరఫరా చేసుకోనే అవకాశం ఉంటుంది. దీనివల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ఇప్పటికైనా అధికారులు స్లూయిజ్‌ల ఆధునికీకరణకు దృష్టి సారించాలని, ప్రభుత్వం చర్యలు చేపట్టి సాగునీటి ఇక్కట్లు పరిష్కరించాలని డెల్టా ప్రాంత రైతులు కోరుతున్నారు.